భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 37.0

కనిష్ఠం : 27.0



ఫ్రై డే భగభగలు

భీమవరం టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోహిణీ కార్తె ప్రభావం తీవ్రంగా ఉంది. మూడు రోజులుగా ఎండలు మండిపోవడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత బటయకు వెళ్లలేని పరిస్థితి. ఎక్కడైనా కొద్దిసేపు నిలబడితే చాలు చెమటలు కారిపోతున్నాయి. రాత్రి 7 గంటల వరకు వేడి తగ్గడంలేదు. దీనికితోడు శుభకార్యాలు ఉండడంతో బంధువర్గాలు ఉక్కపోతకు కంగారు పడుతున్నారు. ఉష్ణోగ్రత 40 డిగ్రీలు ఉన్నట్లు అనిపిస్తోంది. చల్లటి పదర్థాలను తీసుకుని ప్రజలు సేద తీరుతున్నారు. మరి ఈ ప్రతాపం ఎన్ని రోజులు ఉంటాయో అనేదానిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పరీక్ష కేంద్రానికి వెలుతున్న అభ్యర్థులు



భీమవరంలో డీఎస్సీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి



అభ్యర్థుల హాల్‌టికెట్, పత్రాల పరిశీలన

డీఎస్సీ ప్రారంభం

తొలి రోజు పరీక్షకు 23 మంది అభ్యర్థుల గైర్హాజరు

ఐదు పరీక్ష కేంద్రాలకు ఒక కేంద్రంలోనే మొదటి పరీక్ష

భీమవరంలో కలెక్టర్ నాగరాణి తనిఖీ

భీమవరం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీ 2025 పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు కాగా మొదటి రోజు భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల పరీక్ష కేంద్రంలో మాత్రమే పరీక్ష జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు. తొలిరోజు పరీక్షకు 220 మంది హాజరు కావాల్సి ఉండగా 23 మంది గైర్హాజరయ్యారు. 197 మంది అభ్యర్థులు 89.54 శాతం పరీక్షకు హాజరైనట్లయ్యింది. ఎటువంటి మాస్ కాపీయింగ్ నమోదు కాలేదని డీఈవో నారాయణ తెలిపారు. ఒక పరీక్ష కేంద్రాన్ని ఒక స్పెషల్ స్క్వాడ్ టీమ్, విజిట్ చేసినట్లు ఆయన తెలిపారు.

భీమవరం డీఎన్నార్ కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ నాగరాణి తనిఖీ చేశారు. జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలున్నాయని, మొత్తం 16,634 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. జూలై 30 వరకు సుమారు 23 రోజులు మూడు షిఫ్ట్‌లలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. డీఈవో ఇ.నారాయణ, చీఫ్ సూపరింటెండెంట్ తంగిరాల హరి ఆనంద్ ప్రసాద్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

12న వితంతు పించన్ల పంపిణీ

భీమవరం టౌన్, జూన్6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఒంటరి మహిళలకు శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 12 నాటికి ఏడాది పూర్తి కానున్న నేపథ్యంలో ఆరోజు వితంతు పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 1949 మంది ఒంటరి మహిళలకు పింఛన్ అందిస్తారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. మండలాల వారీగా లబ్ధిదారుల జాబితా విడుదల చేశారు. వాస్తవంగా 2023 డిసెంబరు నుంచి ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ఏడాది నవంబరు వరకు వచ్చిన 1963 దరఖాస్తులను పరిశీలన చేసి అందులో 1949 మందిని ఎంపిక చేశారు.

మండలాల వారీగా మంజూరైన పింఛన్లు

ఆచంట 73, ఆకివీడు 44, ఆకివీడు(అర్బన్) 20, అత్తిలి 63, భీమవరం 86, భీమవరం(అర్బన్) 67, గణపవరం 89, ఇరగవరం 81, కాళ్ల 76, మొగల్తూరు 87, నరసాపురం 114, నరసాపురం(అర్బన్) 41, పాలకొల్లు 91, పాలకోడేరు 80, పాలకొల్లు(అర్బన్) 48, పెంటపాడు 88, పెనుగొండ 86, పెనుమంట్ర 67, పోడూరు 87, తాడేపల్లిగూడెం 116, తాడేపల్లిగూడెం(అర్బన్) 79, తణుకు 69, తణుకు అర్బన్ 71, ఉండి 76, వీరవాసరం 67, యలమంచిలి 83

టీడీఆర్ ట్విస్ట్

వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన టీడీఆర్ బాండ్‌ల విలువను తగ్గిస్తూ కూటమి ప్రభుత్వం పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. అక్రమ పద్ధతిలో అధిక విలువతో బాండ్‌లు పొందిన వారికి దిమ్మదిరిగే నిర్ణయం తీసుకుంది. తణుకు మునిసిపాలిటీ పరిధిలో గజం స్థలానికి రూ.20వేలు వంతున లెక్కకట్టి బాండ్‌లు జారీ చేయడం ద్వారా 18 ఎకరాల భూమిని సేకరించారు. కూటమి ప్రభుత్వం గజం ధర రూ.1100 నిర్ధారిస్తూ నాలుగు రెట్లు అధికంగా రూ.4400 ధరతో బాండ్ల విలువ నిర్ధారించింది. ఈ చర్యతో దళారుల కళ్లు బైర్లు కమ్మాయి.

- అక్రమార్కులకు ఝలక్
- గజం ధర రూ.20 వేల నుంచి రూ. 1100కు తగ్గింపు
- నిబంధనల మేరకు నాలుగు రెట్ల విలువతో రూ.4400 బాండ్‌ల జారీ
- గతంలో బాండ్‌ల విలువ రూ.800 కోట్లు
- సవరణతో ప్రస్తుత విలువ రూ.43 కోట్లు
- ఆన్‌లైన్‌లో బదిలీ చేసిన మునిసిపాలిటీ

బాండ్ విలువ తగ్గించిన ప్రభుత్వం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తణుకు మునిసిపాలిటీ పరిధిలో కంపోస్ట్ యార్డు విస్తరణకు కొంత భూమి, మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్ ఫీల్డ్ ఉందని ఇంకొంత భూమి, పేదల ఇళ్ల కోసం కేటాయించిన స్థలాలకు రహదారి అంటూ మరికొంత భూమిని సేకరించారు. దానికి టీడీఆర్ బాండ్‌లు జారీ చేశారు. పట్టణంలోని స్థలాలతో సమానంగా గజం విలువ రూ.20 వేల నుంచి రూ.22వేల వరకు నిర్ధారించారు. అందుకు నాలుగు రెట్లు అంటే 20 ఎకరాలకు దాదాపు రూ.800 కోట్లు విలువైన బాండ్‌లు జారీ చేసేశారు. పశ్చిమలో అతి పెద్ద కుంభకోణంగా విమర్శలు రావడంతో అప్పటి నామమాత్రపు చర్యలు తీసుకుంది. మొక్కుబడి దర్యాప్తులతో సరిపెట్టి టీడీఆర్ బాండ్‌లకు కారకులైన వారిని పట్టించుకోలేదు. బాండ్‌ల జారీలో కీలకమైన వైసీపీ నేతలను వెనకేసుకొచ్చింది.

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కథ అడ్డం తిరిగింది. ప్రభుత్వం సీబీసీఐడీ దర్యాప్తు చేపట్టింది. మరోవైపు గత బాండ్‌లను రద్దు చేస్తూ వ్యవసాయ భూములను ప్రామాణికంగా తీసుకుని బాండ్‌లు జారీ చేయాలని సూచించింది.

దళారులకు చెక్ పెట్టిన ప్రభుత్వం

టీడీఆర్ బాండ్‌లు పొందిన తర్వాత కూటమి ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును దళారులు అవకాశంగా తీసుకున్నారు. వ్యవసాయ భూమి ఆధారంగా బాండ్‌లు ఇవ్వాలని ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. అది కూడా అనుకూలంగా మలచుకోవాలని దళారులు ప్రయత్నించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డోర్ నెంబర్, ఎల్‌పి నెంబర్ మార్చుకుని అధిక ధర ఉండేలా చూసుకున్నారు. గజం విలువ రూ.20వేలు ఉన్నట్లు లెక్కలు వేసి మునిసిపాలిటీకి సమర్పించే ప్రయత్నం చేశారు. అందుకు నాలుగు రెట్లు విలువైన బాండ్‌లు జారీచేయించుకునేలా పావులు కదిపారు. బాండ్‌లు గజాల రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. దానిని అడ్డం పెట్టుకుని మళ్లీ లాబీయింగ్‌కు దళారులు ప్రయత్నం చేశారు. ఈ భాగోతాన్ని గమనించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ టీడీఆర్ బాండ్‌ల విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడంతో ప్రభుత్వం, మునిసిపాలిటీ అప్రమత్తమైంది. కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. కంపోస్ట్ యార్డు, గ్రీన్ ఫీల్డ్, కొత్త రహదారి కోసం ప్రభుత్వం సేకరించిన 18 ఎకరాల భూమి ధరను రూ.55 లక్షలుగా నిర్ధారించారు. గజం విలువ దాదాపు రూ.1100గా నిర్ణయించారు. అందుకు నాలుగు రెట్లు అంటే గజానికి రూ.4400 విలువైన బాండ్‌లు మాత్రమే ఇచ్చారు. బాండ్‌ల యజమానులతో సంబంధం లేకుండా గతంలో జారీ చేసిన వాటి ధరలను మార్చేశారు. ఇప్పుడు వాటి విలువ రూ.4400 కావడంతో దళారుల కళ్లు బైర్లుకమ్మాయి. బాండ్‌లు కొత్తగా ఇవ్వాల్సిన అవసరం లేకుండా పాత ధర మార్పు చేశారు. ఎవరికైనా బాండ్‌లు విక్రయించుకుంటే గజానికి రూ. 4400 మాత్రమే లెక్క చూపుతుంది. గతంలో అడ్డదారిలో అధిక ధరలకు మంజూరైన బాండ్‌లపై కూటమి ప్రభుత్వం ట్విస్ట్ ఇచ్చింది.

కొమరవరం ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం

ముందుగానే రాజీనామా

తణుకు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొమరవరం గ్రామ ఉప సర్పంచ్ గోళ్ల ప్రసాద్ శుక్రవారం పదవికి రాజీనామా చేశారు. ఉప సర్పంచ్‌పై పంచాయతీ పాలకవర్గ సభ్యులు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. దీనితో పాలకవర్గ సభ్యులు శుక్రవారం ప్రత్యేక సమావేశం ద్వారా అవిశ్వాస తీర్మానం ఆమోదించి అనంతరం నూతన ఉప సర్పంచ్‌ను ఎన్నుకోవలసి ఉంది. పెద్దల సూచనతో అవిశ్వాస తీర్మానానికి ముందే ఉప సర్పంచ్ రాజీనామా చేయడంతో కొత్త ఉప సర్పంచ్ ఎన్నికక కోసం కలెక్టర్‌కు నివేదిక పంపించినట్లు గ్రామ కార్యదర్శి తెలిపారు. పంచాయితీ ప్రత్యేక సమావేశానికి ఏర్పాట్లను ఆర్డీవో కౌసర్ బానో, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ పరిశీలించారు.

కాల్వలు, డ్రెయిన్లు శుభ్రం చేయండి



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పూడిక తీత, గట్ల పటిష్టతకు రూ.25.66 కోట్లు

సకాలంలో పనులు పూర్తి కావాలి : కలెక్టర్

భీమవరం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ పనులను అత్యంత నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లాకు మంజూరైన ఇరిగేషన్ ఓ అండ్ ఎం పనుల నిర్వహణపై జలవనరుల శాఖ అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. డ్రెయిన్లు, కాలువల్లో తూడు తొలగింపు, పూడికతీత పనులకు, గట్లను పటిష్టపరిచేందుకు కాలువలకు సంబంధించి రూ.13.66 కోట్లు, డ్రెయిన్స్‌కు సంబంధించి రూ. 12 కోట్లు మంజూరు చేయడం జరి గిందన్నారు. సాగు, తాగునీటి ఇబ్బంది లేకుండా పనులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. భీమవరంలోని ప్రధాన కాలువలో పేరుకుపోతున్న చెత్తను 15 రోజులకొకసారి తొలగించాలని ఆదేశించారు. ఉప్పుడేరు డ్రెడ్జింగ్ పనులకు రూ.6 కోట్లు, రూ.3 కోట్లు రెండు ప్యాకేజీల కింద మొ త్తం రూ.9 కోట్లు మంజూరయ్యాయని, టెండర్స్ పిలవడం జరిగిందన్నారు. సమావేశంలో ఈఈ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డ్రెయిన్ల శాఖ ఈఈ సీహెచ్.సత్యనారాయణ, డీఈలు కె.శ్రీనివాస్, కె.ధర్మజ్యోతి, సీహెచ్.వెంకట నారాయణ, డీఎస్‌వీవీఎస్.మూర్తి, ఏఈ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సేంద్రియ ఉత్పత్తులు

భీమవరం టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో రోగులకు నాణ్యమైన ఆహారం అందే విధంగా సేంద్రియ ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని, వారంలో ఒకరోజు విక్రయ స్టాల్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. తెలిపారు. పీహెచ్‌సీలో రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి రసాయన రహిత సహజ ఆహారం మేలు అన్నారు. భీమవరం ఏరియా హాస్పిటల్‌లో స్టాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు ఉత్పత్తులు నిల్వ చేసేందుకు గోడౌన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

ఒక పుస్తకమైనా ఇవ్వండి..

భీమవరంటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలకు ప్రతి ఒక్కరు పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఒక్క పుస్తకమైనా ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞాన తరగతులు ఎంతో ఉపయుక్తం అన్నారు. 40 రోజులుగా నిర్వహించిన తరగతుల సందర్భంగా పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. తాను చదువుకునే రోజులలో క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు, న్యూస్ పేపర్ చదివే వాడిని అని గుర్తు చేసుకున్నారు. శిక్షణ పొందిన విద్యార్థుల ప్రతిభ పాటవాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, వేసవి విజ్ఞాన తరగతుల కన్వీనర్ అల్లు శ్రీనివాసును అభినందించారు. విజేతలకు, పాల్గొన్న ప్రతి విద్యార్థికి బహుమతులను అందజేశారు. కోచింగ్ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించిన మహమ్మద్ సరోజినీ, డాన్స్ మాస్టర్ శ్యామ్‌ను జేసీ సత్కరించారు.

సార్వా సీజన్‌కు ఏ రకాలు అనుకూలం?

వరి విత్తనాలపై శాస్త్రవేత్తల సూచనలు 6

సెంట్రల్ బ్యాంక్ రుణాల స్కాం దర్యాప్తు వేగవంతం

7

ప్రజలకు స్వచ్ఛ జలం



జిల్లాలో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విజ్జేశ్వరంలో శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. అక్కడే గోదావరి జలాలను శుద్ధి చేసి పైపులైన్ ద్వారా పట్టణాల్లోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేస్తారు. పనులు చేపట్టడానికి అధికారులు సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేశారు.

- గోదావరి జలాలు శుద్ధి చేసి పట్టణాల్లో మంచినీటి పథకాలకు సరఫరా
- ఇప్పటికే నిధుల కేటాయింపు
- డీపీఆర్ ఆమోదించిన ప్రభుత్వం

పట్టణాల వారీగా నిధులు రూ.కోట్లలో	
భీమవరం	167.72
పాలకొల్లు	119.26
తణుకు	118.11
నరసాపురం	125.92
ఆకివీడు	76.34

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రజలకు రక్షిత మంచినీరు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో వాటర్‌గ్రిడ్ పథకాన్ని అమలు చేస్తోంది. విజ్జేశ్వరం వద్ద శుద్ధిప్లాంట్ నిర్మించి అక్కడి నుంచే ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీటి సరఫరా చేయనున్నారు. జిల్లాలో మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు నీటి సమస్య లేకుండా పైప్‌లైన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేశారు. కేంద్రం అమలు చేస్తున్న అమృత్ 2.0లో నిధులను కేటాయించారు. భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం మునిసిపాలిటీల తోపాటు ఆకివీడు నగర పంచాయతీకి అమృత్‌లో పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను వర్తింపజేశారు. గత తెలుగు దేశం ప్రభుత్వంలో పాలకొల్లు, తణుకు మునిసిపాలిటీలకే పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను ఖరారు చేశారు. గడచిన వైసీపీ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. తాజాగా జిల్లాలోని తాడేపల్లిగూడెం మినహాయించి మిగిలిన పట్టణాలకు పైప్‌లైన్ ప్రాజెక్ట్ అమలకు ప్రణాళిక చేశారు. మిగతా 8వ పేజీలో



తాడేపల్లిగూడెంలో దగ్ధమమైన లారీ

విద్యుత్ వైర్లు తగిలి లారీ దగ్ధం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లారీకి హెచ్‌టి వైర్లు తగలడంతో దగ్ధమైంది. మంటలు గమనించిన స్థానికులు అప్రమత్తం చేయడంతో వాహన డ్రైవర్, క్లీనర్ ప్రమాదం లేకుండా బయటపడ్డారు. పట్టణానికి చెందిన సీహెచ్ భాను వాత్సవ్‌కు చెందిన లారీ దగ్ధం కావడంతో రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి రామారావు తెలిపారు.



బీచ్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దాసి రాజు, అధికారులు

9న బీచ్‌లో యోగాసనాలు

మొగల్తూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం, కేపీపాలెం బీచ్ వద్ద ప్రభుత్వ శాఖల అధికారులు ఈ నెల 9న యోగాసనాలు వేయనున్నారు. యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడానికి పేరుపాలెం, కేపీపాలెం బీచ్ వద్ద అనువైన స్థలాన్ని ఆర్డీవో దాసి రాజు శుక్రవారం పరిశీలించారు. అనువైన స్థలాలను గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ్ కిశోర్, ఎంపీడీవో త్రిశూలపాణి, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులున్నారు.





డీఎస్సీ సందడి

మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లా కేంద్రంలో ఈ పరీక్షలకు మూడు విద్యాసంస్థల్లో టెస్టు సెంటర్లను ఏర్పాటు చేయగా, తొలిరోజు రెండు సెంటర్లలో మాత్రమే పరీక్షలు జరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు.



ఏలూరులో చెక్ చేసి పంపుతున్న దృశ్యం



భీమవరంలో...











ప్రాబ్లమ్ జోన్



ఫౌంటేన్‌కు ఏమైంది ?

తణుకు నరేంద్ర సెంటర్‌లో ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా ఫౌంటేన్ నిర్మించారు. రాత్రయితే రంగులు విరమజిమ్ముతూ నీరు వెదజల్లుతూ అందంగా బాటసారులకు కనువిందు చేసేది. సెంటర్ శోభాయమానంగా కనిపించేది. అయితే కొన్ని నెలలుగా నిర్వహణలేక మరమ్మతులకు గురైంది ప్రస్తుతం ఫౌంటేన్‌లో నాచు కట్టిన నీరుతో దర్శన మిస్తుంది. మున్సిపల్ అధికారులు నిర్వహణ చేపట్టడం లేదు. సాయంత్రం వేళ ఆహ్లాదాన్ని అందించే విధంగా ఫౌంటేన్‌కు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని కోరుతున్నారు.

-తణుకు (ఆంధ్రజ్యోతి)



పాలకోడేరులో అడుగంటిన మంచినీటి చెరువు

దాహం తీరేదెలా..!

గ్రామాల్లో మంచినీటి చెరువులు అడుగంటాయి. చాలా గ్రామాల్లో పరిశుభ్రమైన తాగు నీరు అందక ప్రజలు విలవిల్లాడుతున్నారు. పాలకోడేరు మండలంలోని గొల్లలకోడేరు, పాలకోడేరు, గొరగనమూడి, మైప, శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు తదితర గ్రామాల్లో చెరువులు అడుగంటాయి. పాలకోడేరు, మైప, వేంద్ర గ్రామాల్లో చెరువులు అడుగంటినప్పటికీ ఆయా గ్రామాల్లో బోరు నీరు అందించి దాహం తీర్చుతున్నారు. గొల్లలకోడేరు, గొరగనమూడి తదితర గ్రామాల్లో బోరు నీరు అంతంత మాత్రంగానే ఉండటంతో ఒకపూటతోనే నీరు అందించి సరిపెడుతున్నారు. మరికొన్ని రోజుల్లో పంట కాలువలు రాకపోతే ఆయా గ్రామాల్లో తాగునీటి కోసం ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు అంటున్నారు. ఒకవైపు కాలువల తవ్వకాల పనులు చేపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాలువలు విడుదల చేయడం ఆలస్యమైతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో కాలువల్లోకి త్వరితగతిన నీరు అందించాలని కోరుతున్నారు.

-పాలకోడేరు, (ఆంధ్రజ్యోతి)



కోలనపల్లిలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

నెరవేరని స్వచ్ఛగ్రామాల లక్ష్యం !



స్వచ్ఛ గ్రామాలు దిశగా చెత్తనుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వం అడుగులు వేసింది. గ్రామాల్లో లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. చెత్తను ఆదాయ వనరులుగా మార్చాలన్న లక్ష్యం ఆచరణకు నోచుకోవడం లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో 394 గ్రామ పంచాయతీలకు సంబంధించి 368 సంపద తయారీ కేంద్రాలు నిర్మాణం చేశారు. ప్రతి గ్రామంలో చెత్తశుద్ధి సంపద కేంద్రాన్ని నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తరలించి శుద్ధిచేసే ప్రక్రియ ప్రారంభించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట నిర్మాణాలు చేశారు. అయితే అవి లక్ష్యానికి దూరంగా ఉత్సవ విగ్రహాలుగా ఆయా గ్రామాల్లో దర్శనం ఇస్తున్నాయి. గ్రామాల్లో చెత్తను సేకరించి ఈ కేంద్రాలకు తరలించాలి. ఈ ప్రక్రియ ఏగ్రామ పంచాయతీలో కూడా జరగడం లేదు. గ్రామాల్లో రహదారి మార్జిన్, కాలువ గట్లు వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్త సంపద కేంద్రాలు వద్దకు చేర్చే రహదారి మార్గాలు కూడా లేకుండా నిర్మాణాలు పూర్తి చేశారు. వీటిని వినియోగంలోకి తెస్తే పంచాయతీలకు ఆదాయంతో పాటు రైతులకు సేంద్రియ ఎరువు లభిస్తుంది.

- ఆకివీడు (ఆంధ్రజ్యోతి)

సార్వాకు ఏవి అనుకూలం ?

వరి విత్తనాలపై శాస్త్రవేత్తల సూచనలు



పెనుమంట్ర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సాగు చేసే పంటలలో వరి ప్రధానమైనది. సార్వాలో ఈ రెండు జిల్లాల్లో కలిసి సుమారు రెండు లక్షల హెక్టార్లలో వరి సాగు చేస్తారు ప్రస్తుతం రైతులు నారు మడులు పోసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో జిల్లాకు అనువైన రకాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మార్టేరు వరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు సూచించిన వరి వంగడాలు ఇవీ..

ఎంటీయు 1318 : తక్కువ నత్రజనితో అధిక దిగుబడి ఇచ్చే పడిపోని రకం ఇది. పంట కాలం 150 రోజులు. రెండు వారాలు నిద్రావస్థ కలిగి ఉండి మొలకెత్తదు. సన్నగింజ రకం, కాండం, ధృడంగా ఉండి చేనుపై పడిపోదు. గింజ మధ్యస్త సన్నంగా ఉండి పచ్చి బియ్యానికి అనుకూలం. బియ్యం పారదర్శకంగా ఉండి ఎక్కువ గింజలు కలిగి అధిక దిగుబడి వస్తుంది.

స్వర్ణ (ఎంటీయు 7029) : తక్కువ నత్రజనితో అధికదిగుబడి ఇచ్చే రకం. చౌడు భూముల్లో సాగుకు, ఎండాకు తెగులు ఆశించే ప్రాంతాలకు అత్యంత అనుకూలం. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే అధిక దిగుబడి ఇస్తుంది. పంట కాలం 150 నుంచి మూడు వారాలు ఉంటుంది. నిద్రావస్థ కలిగి ఉండి గింజ మొలకెత్తదు

ఇంద్ర (ఎంటీయు 1061) : చేను పడి పోదు. పిలక దశలో 10 రోజులు వరకు ముంపు తట్టుకుని అధిక దిగుబడి ఇస్తుంది. సన్నబియ్యం. మార్కెట్ రేటు ఎక్కువగా ఉంటుంది. పంట కాలం 150 రోజులు.

మారుటేరు సాంబ (ఎంటీయు 1224) : సన్నబియ్యం . దీని పంట కాలం 140 రోజులు. దోమపోటును తట్టుకుంటుంది. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి బావుంటుంది.

మారుటేరు మసూరి (ఎంటీయు 1262) : సన్నబియ్యం.. పంట కాలం 155 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉండి ఎండాకు, దోమ పోటును తట్టుకుంటుంది. కాండం ధృడంగా ఉండి చేను పడిపోదు. గింజ రాలిక తక్కువగా ఉంటుంది.

సుజాత (ఎంటీయు 1210) : పంట కాలం సార్వాలో 135 రోజులు, దాళ్వాలో 125 రోజులు . 2 వారాలు నిద్రావస్త కలిగి దోమ పోటు, అగ్గి తెగులును తట్టుకుంటుంది. కాండం గట్టిగా ఉండి చేను పడిపోదు. గింజ రాలిక తక్కువగా ఉంటుంది. నేరుగా విత్తే విధానానికి కూడా అనుకూలం

అమర (ఎంటీయు 1061): పిలక దశలో రెండు వారాలు వరకు ముంపు తట్టుకుంటుంది. చేను పడిపోదు. దోమ పోటు, ఎండాకు తెగుళ్ళను తట్టుకుంటుంది. పంట కాలం 150 రోజులు.

వేసవి దుక్కులు ప్రారంభం

చింతలపూడి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గత మే నెలలో పడిన అకాల వర్షాలకు మెట్ట రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. ప్రతీ ఏడాది ఖరీఫ్‌లో జూన్ రెండో వారంలో తొలకరి వర్షాలు ప్రారంభమవుతాయి. జూన్ 11న రైతులు ఏరువాకతో పొలాలు దున్నుకుంటారు. ఏ మాత్రం వర్షం పడినా నారుపోసుకోవడం ప్రారంభిస్తారు. అయితే ఈ ఏడాది మే నెలలో వర్షాలు పడడంతో చింతలపూడి మండలంలోని రైతులు వరి సాగు కోసం వేసవి దుక్కులు సిద్ధం చేసుకున్నారు. ఈ విధంగా మండలంలో 50 శాతంకుపైగా పొలాలు దుక్కులు దున్నుకున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ సబ్సిడీపై జనుము, జీలుగు విత్తనాలు సరఫరా చేయగా ప్రకృతి సేద్యంలో కూడా పచ్చిరొట్ట కోసం నవ ధాన్యాలు వినియోగిస్తున్నారు. వీటిని రైతులు విరివిగా చల్లుకుంటున్నారు. ఇటీవల వర్షాలకు మొలకెత్తాయి. ఒక మోస్తరు తడులు ఉన్నా కొద్ది కాలంలోనే పచ్చిరొట్ట పెరుగుతుంది. పెరిగిన పచ్చిరొట్టను పొలాల్లో కలియ దున్నుతారు. అవి కుళ్ళి భూమికి ఎరువుగా అదును చేరుతుంది. నల్లరేగడి నేలల్లో పెరిగిన ఈ మొక్కలు ఈ విధంగా చేయకపోతే వర్షాలు పడితే సాధ్యంకాదు. అందుకే ముందుగా ఈ వేసవి దుక్కులు దున్నుతుంటారు. ఇవి కాకుండా కూలీల కొరత, సాగు ఖర్చులు పెరగడంతో రైతులు కూడా కరియత (వెదజల్లే విధానం)నే ఎంచుకుంటున్నారు. అందుకోసం ముందుగానే రెండు, మూడు సార్లు దుక్కులు దున్నాల్సి ఉంటుంది. దీనివల్ల ఊడ్పు ఖర్చులు భారం తగ్గుతుంది. ఈ విధంగా మండలంలోని కాంతం పాలెం, రాఘవాపురం, మల్లాయి గూడెం, వెంకటాపురం, సమ్మెటవారి గూడెం గ్రామాల్లో ఈ విధానం సాగు పెరిగింది. అందుకే రైతులు ఈ వేసవి దుక్కులను సిద్ధం చేసుకుంటారు. నాలుగు రోజులుగా ఎండలు తీవ్రంగా కాస్తున్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వచ్చాయన్న వార్తలతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు ఇప్పుడు వర్షాలు వెనక్కిపోవడంతో ఆందోళనపడుతున్నారు. వర్షాలు కురిపించు దేవుడా అని మొక్కుకుంటున్నారు.



దుక్కులు దున్ని సిద్ధం చేసిన పొలం



ఈడూరులో స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వరాల వెంకన్న రథోత్సవం





అత్తిలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలం ఈడూ రులో వరాల వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా శుక్రవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన స్వామి వారి రథంలో స్వామి వారితో పాటు ఉభయ దేవేరులను ఉంచి ఊరేగించారు. బ్యాండు వాయి ద్యాలు, తీన్మార్ డప్పులు, ఏనుగు అంబారీతో పాటు విచిత్ర వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరిం చారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.



తిరువీథుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు.

నేత్రపర్వం.. శ్రీవారి ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తొళక్క వాహనంపై ఉభయనాంచారులతో కొలువుతీరిన చిన్న తిరుమలేశుడు శుక్రవారం రాత్రి క్షేత్రపురవీథుల్లో ఊరేగారు. అట్టహాసంగా జరిగిన ఈ ఏకాదశి ఉత్సవం భక్తజనులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కం వాహనంపై ఉంచి ప్రత్యేకపుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, డోలుసన్నాయివాయిద్యాల నడుమ స్వామివారు కొలువుదీరిన వాహనాన్ని ఊరేగించారు.

తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత

9న బండి ముత్యాలమ్మ జాతర ప్రతి మూడేళ్లకు ఉత్సవాలు

మొగల్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ భక్తుల కోర్కెలు తీర్చే ఆరాధ్యదేవతగా ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారు ప్రసిద్ధి చెందారు. తాడిచెట్టు చుట్టూ నిర్మించిన ప్రాకారమే అమ్మవారి ఆలయంగా బాసిల్లుతున్నది. ఈనెల 9వ తేదీ రాత్రి అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద భారీ విద్యుత్ దీపాలంకరణలతో పాటు ఆలయ పరిధి నాలుగు గ్రామాల్లోనూ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. మూడు సంవత్స రాలకు ఒకసారి నిర్వహించే ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

ఇదీ చరిత్ర..

బ్రిటిష్ పాలనలో ముత్యాలపల్లి గ్రామానికి చెందిన కరణం, మునసబులుగా చెన్నాప్రగడ, దాసరి వంశీయులు ఉండేవారు. ముత్యాలపల్లి ప్రాంతంలో వసూలు చేసిన పన్నుల మొత్తాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి జమ చేసేందుకు జలమార్గం ద్వారా మద్రాసు వెళ్లారు. వీరు అక్కడ ఒక సత్రంలో బసచేసి శిస్తు చెల్లించాల్సిన నాణేలు లెక్కించగా నాలుగు నాణేలు తగ్గాయి. వాటిని ఎలా సమకూర్చాలంటూ ఆలోచిస్తూ నిద్రలోకి జారుకోగా బండి ముత్యాలమ్మ వీరికి కలలోకి వచ్చి నాపేరు బండి ముత్యాలమ్మ అని మీరు పడుకున్న సత్రం ఎదురుగా ఉన్నానని మీతో పాటు తీసుకువెళ్లండని ఆదేశించారు. నిద్రలేచిన కరణం, మునసబులు తిరిగి నాణాలు లెక్కించుకోగా సరిపోయాయి. ఇది అమ్మవారి మహిమగా వారు గుర్తించారు. అయితే అమ్మవారి రూపం ఎలా గుర్తించాలో తెలియలేదు. వారు తిరుగు ప్రయాణంలో మద్రాసు నుంచి విజయవాడకు చేరుకుని అక్కడ పడవ ప్రయాణంలో ముత్యాలపల్లికి బయలుదేరగా పడవ నిండా మట్టిరాళ్లు కనిపించాయి. వాటిలో మూడు రాళ్ళు ప్రత్యేకంగా ఉండటంతో వాటిని అమ్మవారి రూపంగా భావించారు. మరలా అమ్మవారు కనిపించి వీటిని ముత్యాలపల్లి గ్రామంలో ఈశాన్యం మూలగా ఉన్న పొన్నాలవారి తోటలోని తాడిచెట్టు కింద ప్రతిష్ఠించమని ఆదేశించడంతో మొదటి రాయిని ముత్యాలమ్మగా, రెండో రాయి మారెమ్మగానూ, మూడో రాయి పోతురాజుగా భావించి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి తాడి చెట్టు రూపంలో అమ్మవారు పూజలందుకుంటున్నారు.ముత్యాలమ్మను తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదైవంగా కొలుస్తారు. పెళ్లి, గృహప్రవేశాలు, ఇతర ఆహ్వాన పత్రాలు అమ్మవారి తాడి చెట్టుకింద పెట్టి పూజిస్తారు. ముత్యాలపల్లి ప్రాంతంలో తమ పిల్లలకు ముత్యాలమ్మ, లేదా ముత్యా లరావు, ముత్యాలరాజు ఇలా అమ్మవారి పేరు వచ్చేలా తమ బిడ్డలకు నామకరణం చేస్తుంటారు.





విద్యుద్దీపాలతో అలంకరణ



బండి ముత్యాలమ్మ అఖండ జ్యోతి



గన్ని వీరాంజనేయులుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నాయకులు, ఆప్కాబ్ సిబ్బంది

ఆప్కాబ్ చైర్మన్ గన్ని బాధ్యతలు స్వీకరణ

ఏలూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆప్కాబ్ కార్యాలయం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గన్ని దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, ఆప్కాబ్ సిబ్బంది గన్నికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, వలవల బాబ్జి, పీతల సుజాత పాల్గొన్నారు.



బ్యాంకు ఎదుట సీపీఎం నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న బాధితురాలు

బ్యాంకులో నగలు మాయమయ్యాయంటూ ఆందోళన

ఆకివీడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు లాకర్‌లో పెట్టుకున్న బంగారం మాయమైందని అధికారులను ప్రశ్నిస్తుంటే తాత్సారం చేస్తున్నారని బాధితురాలు వల్లభుని శ్రీహర్షలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎస్ టర్నింగ్‌లో ఉన్న గ్రామీణ బ్యాంకు దగ్గర సీపీఎం నేతలు, బంధువులతో కలిసి నేలమీద భైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ బ్యాంకు లాకర్‌లో పెట్టుకొన్న బంగారం 27 కాసులు మాయమయ్యాయని అధికారులకు చెప్పి 23 రోజులు అవుతున్నా పట్టించుకోకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు బాధితురాలు ఎదుట బ్యాంకు అధికారులతో మాట్లాడగా తమ హెడ్డాఫీసు నుంచి సీసీ ఫుటేజ్ వచ్చినా క్లారిటీ లేనందున బ్యాంకు ఉన్నతాధికారులు శనివారం పోలీస్ స్టేషన్‌కు వస్తారనడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వర్మ, రవితేజ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి రూ.8 లక్షల ఆర్థిక సాయం

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన రాపాక అచ్చయ్య బాబు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ సందర్భంగా బొలిశెట్టి రాజేష్, తోట రాజా మిత్రబృందం సమకూర్చిన రూ.8 లక్షలు శుక్రవారం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ బాధిత కుటుంబంలో ఒకరికి పురపాలక సంఘంలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాళ్ళ గోపి కృష్ణ, కోట శ్రీరామ్, సోమశంకర్రావు, రామకూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ గీతాబాయి

నరసాపురం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని కే బేతపూడి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సర్వేలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఇచ్చిన సర్వేను ఏఎన్‌ఎంలు పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం కరోనా కేసులు రాష్ట్రంలో నమోదు అవుతున్నందున ప్రతి ఒక్కరూ ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. రోగులు అనుమానాస్పదంగా ఉంటే తక్షణం వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. కె రూఫస్, సిబ్బంది ఉన్నారు.



తాపీ మేస్త్రికి నూతన వస్త్రాలు అందిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు ప్రెస్‌క్లబ్ ఆదర్శంగా నిలవాలి

పాలకొల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ప్రెస్‌క్లబ్ రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచే విధంగా కృషి చేయాలని, ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.25 లక్షలు అందజేస్తానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రెస్‌క్లబ్ నూతన భవనం గృహ ప్రవేశం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తన విజయాలకు మీడియా మిత్రుల సహకారం ఎంతో ఉందని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రెస్‌క్లబ్ ఆధునిక వసతులతో అందరికీ వినియోగ పడే విధంగా తీర్చిదిద్దాలని మంత్రి అన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకట రమణ దంపతులు గృహప్రవేశం చేశారు ఈసందర్భంగా సిద్దాంతి సోమంచి శ్రీనివాసశాస్త్రి, తాపీ మేస్త్రి, ఇతర మేస్త్రిలకు మంత్రి చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ముత్యాల శ్రీనివాస్, పీటీ వెంకటేశ్వరరావు, గోపరాజు గోపి, కె గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు గంజాయి మొక్కలు పెంచిన వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో దానమ్మగుడి సమీపంలో ఇంటి ముందు గంజాయి మొక్క పెంచిన వ్యక్తిని తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంకు చెందిన మారిశెట్టి పద్మాకరరావు ఇంటి ముందు గంజాయి మొక్కలు ఉన్నాయని సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి గంజాయి మొక్కలు ఉన్నట్టు గుర్తించారు. మారిశెట్టి పద్మాకరరావును అదుపులోకి తీసుకున్నారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్సై బాదం శ్రీనివాస్ వివరించారు.



భీమవరంలో అంతర్ జిల్లాల బాలికల హాకీ పోటీలు

భీమవరం టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : 15వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాలికల హాకీ పోటీలు శుక్రవారం భీమవరంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని నలుమూల నుంచి మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. 10 మ్యాచ్‌లు జరగ్గా ఇందులో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు కృష్ణాజిల్లా జట్టుపై 12 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ప్రారంభ కార్యక్రమంలో డీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మోషేజ్, పీడీ నరసింహరాజు, పశ్చిమగోదావరి జిల్లా హాకీ అసోసియషన్ అధ్యక్షుడు కలిదిండి ఆనందరాజు, కార్యదర్శి బద్రినాథ్, జాయింట్ సెక్రటరీ నాగబాబు, పాల్గొన్నారు. మరో రెండు రోజులు పాటు పోటీలు జరుగనున్నాయి.





తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజ్

తణుకు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజీ యూనిట్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం ఆసుపత్రిలోని ప్రత్యేక గదిని సిద్ధం చేశారు. జిల్లా ఆసుపత్రి కావడంతో పలు ప్రాంతాల నుంచి అనేక సమస్యలతో ఇక్కడికి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అవసరమైన సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఇటీవల ఆసుపత్రి సలహా సంఘ సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. బ్లడ్ బ్యాంకు ఏర్పాటు అయ్యేవరకు ముందుగా బ్లడ్ స్టోరేజీ పాయింట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే యుద్ధప్రాతిపదికన స్టోరేజీ యూనిట్‌ను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



వారంలో రక్తదాన శిబిరాలు

ఆసుపత్రిలో బ్లడ్ నిల్వలు పెంచేందుకు అనువుగా వారం రోజుల్లో రక్త దాన శిబిరాలు ఏర్పాటుకు సంబంధిత వైద్యులు ప్రణాళిక రుపొందిస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అధిక మొత్తంలో రక్తం నిల్వలు చేయనున్నారు. ఆసుపత్రిలో శాశ్వతంగా బ్లడ్ బ్యాంకు ఏర్పాటు సంబందించిన చర్యలు వేగంగా జరుగుతున్నాయి. బ్లడ్ బ్యాంకుకు సంబందించి ఇప్పటికే దరఖాస్తు చేశారు. దీనికి కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి కూడా వచ్చింది. మిగిలిన ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తవుతుందని ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ అరుణ చెప్పారు.

చిన్నారిని కబళించిన క్యాన్సర్

పేరూరులో విషాదఛాయలు



ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : చిన్న వయస్సులోనే ఓ బాలికను ఊపిరి తిత్తుల క్యాన్సర్ కబళించింది. పేరూ రు గ్రామానికి చెందిన గొరిపర్తి వెంకన్న, రాజేశ్వరి దంపతుల కుమార్తె మౌనిక (11) శుక్రవారం మరణించింది. ఆ బాలిక ఐదవ తరగతి చదువుతున్న సమయం లోనే గత ఏడాది ఈ వ్యాధికి గురికావడ ంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించి వైద్యం చేయిం చినా ఫలితం లేకపోయింది. ఈ వ్యాధి తీవ్రం కావడంతో తట్టుకునే సామర్థ్యం లేని మౌనిక మరణించింది. కేవలం కూలి పనులపైనే జీవనం సాగిస్తున్న వెంకన్న దంపతులకు ఆర్థిక స్థోమత లేక తమ కుమార్తెకు దూర ప్రాంతాలకు తీసుకువెళ్ళి మెరుగైన వైద్యాన్ని చేయించలేకపోయారు. బాలిక మరణంతో పేరూరులో విషాదం నెలకొంది. మౌనిక భౌతిక కాయం వద్ద తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచి వేసింది. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ మౌనిక కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

చదరంగం పోటీల విజేతలకు బహుమతులు



భీమవరం అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా భీమవరం అనసూయ చెస్ అకాడమీ వారిచే నిర్వహించిన నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాళ్ళ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు చదరంగంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఒక్కొ మొక్క పెంచి పోషించాలన్నారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చదరంగం నేర్చుకోవడం ద్వారా అపారమైన మేధాశక్తిని పెంపొందించుకుని విద్యలో రాణిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికి మొక్కలు పంపిణీ చేశామన్నారు. సురేష్ జైన్, నోముల రామారావు, సునీల్, గౌరవ్, విజ్ఞాన వేదిక సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రథమ విజేత డి.సురేష్ (పాలకొల్లు), ద్వితీయ విజేత ఎన్.వరుణ్‌తేజ్ (భీమవరం), తృతీయ విజేత ఏ.రామకృష్ణ, (విజయవాడ) బహుమతులు అందుకున్నారు.



సీఐటీయు కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రేపు ఏలూరులో శ్రమ కావ్య గాన సదస్సు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రమ ఔన్నత్యాన్ని తెలియచేస్తూ డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రమ కావ్యగాన సదస్సు ప్రారంభమవుతుందని సీఐటీయు ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగ రాజు, డి.ఎన్.వి.డి ప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం సీఐటీయు కార్యాలయంలో ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, వివిధ రకాల సేవలు చేసే ఉద్యోగులు, శ్రామికులు వారి గొప్పతనాన్ని వివరిస్తూ అశోక్ తేజ శ్రమ కావ్యం రచించారని ఆయన స్వయంగా రెండు రాష్ట్రాల్లో 50 ప్రదర్శనలు ఇచ్చారని, ఈ నెల 8న ఏలూరులో 60వ సభ నిర్వహిస్తారని చెప్పారు. సదస్సుకు కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ఉద్యోగులు, పాల్గొనాలని కోరారు.

ఆరబెట్టిన కోకో గింజలు అపహరణ

జంగారెడ్డిగూడెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆరబెట్టిన కోకో గింజలను ఎత్తుకుపోయిన ఘటనలో రెండు కేసులు నమోదైనట్టు ఎస్.ఐ ఎస్.కె. జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడేనికి చెందిన పెన్మెత్స అరుణ్ వర్మకు మండలంలోని రామచర్లగూడెంలో పొలం ఉంది. తన పొలంలో ట్రేలలో ఉడకబెట్టిన కోకో గింజలను ఈ నెల 4న గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ట్రేలతో పాటు ఎత్తుకు పోయారని, వాటి విలువ రూ.62,500 ఉంటుందని ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు. అలాగే మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన రైతు అట్లూరి శ్రీనివాస రావు తన ఇంటి వరండాలో ఆరబెట్టిన 30 బస్తాల కోకో గింజలలో రూ.లక్షా 10 వేల విలువ చేసే ఆరు బస్తాల కోకో గింజలను గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 4న అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి పురుగు మందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దెందులూరు మండలం సోమవరప్పాడులోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన చాందిక వీర వెంకట నరేంద్ర(38) తన భార్యతో ఘర్షణ పడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన నరేంద్ర శుక్రవారం మధ్యాహ్నం పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురవగా బాధితుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సాయి(ఫైల్)

భీమవరం క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక యువకుడు రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి భీమవరం రూరల్ ఎస్ఐ ఎం.వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రెండవ పట్టణంలో సత్యవతి నగర్‌కు చెందిన గవిడి సాయి(22) ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి బానిసైన సాయి అప్పుడప్పుడు కొవ్వాడపుంతలోని స్నేహితుడి రూమ్‌కు వెళ్లేవాడు. ఇటీవల స్నేహితుడి భార్య డెలివరీ ఉందని ఊరు వెళ్ళాడు. ఇదే సమ యంలో సాయి ఈ నెల 1న ఫ్రెండ్ రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడు. గురువారం వరకు తిరిగి రాలేదు. తల్లిదండ్రులు స్నేహితుడి రూమ్‌లో ఉన్నాడని అనుకున్నారు. గురువారం స్నేహితుడు రూమ్‌కు వచ్చి తలుపు తీసేసరికే సాయి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతదేహం కుళ్లిపోయే స్థితిలో ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని శుక్రవారం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

ఊరు వెళ్తే.. ఇంట్లో దొంగలు పడ్డారు

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులు ఊరు వెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటితాళాలు పగులగొట్టి బంగారపు వస్తువులు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు రోడ్డు శివకామాక్షి కాలనీలో నివాసం ఉంటున్న పాలవలస నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో ఈనెల 4న ఊరు వెళ్ళారు. తిరిగి శుక్రవారం వచ్చేటప్పటికి ఇంట్లోని కబ్‌బోర్డులు, ఐరన్ లాకరు పగులగొట్టి ఉన్నాయి. వాటిలోని 6 గ్రాముల బంగారపు వస్తువులు, అరకేజీ వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించి ఏలూరు రూరల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

వేలేరుపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వేలేరుపాడు ఎస్.ఐ. కేవీ రామారావు మాట్లాడుతూ తెలంగాణలోని అశ్వారావుపేటకు చెందిన సరిపల్లి నరసింహరాజు అనే వ్యక్తి కొంతకాలంగా ద్విచక్రవాహనాలు చోరి చేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడని అన్నారు. వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో బైక్ దొంగతనాలకు సంబంధించి కేసు నమోదు కాగా విచారణ ప్రారంభించామని పక్కా సమాచారంతో శుక్రవారం దాడి చేసి ఆ వ్యక్తిని పెదబుర్రతోగు గ్రామం వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా మరో రెండు పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా చోరీలు చేసినట్టు వెల్లడైందన్నారు. వేలేరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, పెద్దాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్, సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లను చోరీ చేయగా మొత్తం ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ బైక్‌ల విలువ రూ.3 లక్షల 10వేలు ఉంటుందని, నిందితుడిని జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

సెంట్రల్ బ్యాంకు రుణాల స్కాం దర్యాప్తు వేగవంతం



నరసాపురంలో ఉన్న సెంట్రల్ బ్యాంకు

నరసాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ బ్యాంకు రుణాల స్కాం దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. రైతులకు తెలియకుండా వారి పొలాలను లీజ్‌కు చేస్తున్నట్లు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి బ్యాంకులో సుమారు రూ.2 కోట్లు రుణం పొందారు. రైతులు తిరుమాని నాగరాజు, శ్రీనివాస్‌లు మరో బ్యాంకుకు రుణం కోసం వెళ్లడంతో ఈ స్కాం బయటపడింది. వారి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కూనపరెడ్డి ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. గత నెల 6న ఈ స్కాం వెలుగుచూసింది. ఇటు సెంట్రల్ బ్యాంకు స్కాంపై స్పందించి ఉన్నతాధికారులతో రెండు సార్లు దర్యాప్తు చేసింది. విచారణ అనంతరం రుణానికి సంబంధించిన కీలక పత్రాలను బ్యాంకు ఉన్నతాధికారులు వెంట తీసుకెళ్లారు. ఇటు బ్యాంకు మేనేజర్ ప్రకాశంను తప్పించి ఇన్‌చార్జి మేనేజర్ ప్రదీప్‌కు మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. దీనిపై మొదట్లో రైతులు కేసు పెట్టలేదు. రాజీ చేసుకునే ప్రయత్నం చేశారు. అ తరువాత నాగరాజు, ఆయన సోదరుడు శ్రీనివాస్‌లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ యాదగిరికి దర్యాప్తు బాధ్యతల్ని అప్పగించారు. ఇప్పటికే ఆయన రెండ పర్యాయాలను బ్యాంకుకు వెళ్లి పలు అంశాలపై ఇన్‌చార్జి మేనేజర్ నుంచి వివరణ తీసుకున్నారు. రుణాలను సంబంధించిన డాక్యూమెంట్లను కాపీలను అప్పగించాలని కోరారు. అయితే వీటికి సంబంధించిన డ్యాకుమెంట్లు ఇంకా పోలీసులకు అందలేదు, ఇవి అందగానే కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్టు సీఐ యాదగిరి చెప్పారు. అయితే ఈ లీజ్ అగ్రిమెంట్లతో తనకేమి సంబంధం లేదని కూనపరెడ్డి ప్రసాద్ స్పష్టం చేశారు. తన అస్తిని గ్యారంటీగా చూపి రుణం తీసుకున్నారనన్నారు. ఈ రుణం ఇప్పించడంతో పట్టణానికి చెందిన ఓ బ్రోకర్ తన వద్ద రూ.30 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. ఇదే విషయాన్ని పోలీసులకు కూడా తెలియజేశారు. దీంతో ఈ కేసులో బ్రోకర్ కీలకంగా మారాడు. బ్యాంకు పత్రాలందిస్తేగానే అవి పోర్జరీవా.. లేక అసలవి అన్నవి తేలాల్సి ఉంది.

అర్చకుడి ఖాతా నుంచి నగదు మాయం

పెదపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎంత అప్రమత్తంగా ఉంటున్నా సైబర్ నేరగాళ్లు పన్నె ఉచ్చులో ఎవరో ఒక్కరూ చిక్కుకుని నగదు పోగొట్టుకుంటూనే ఉన్నారు. తాజాగా పెదపాడు మండలం తోటగూడెం గ్రామానికి ఓ పూజారి ఇదే విధంగా సైబర్ నేరగాళ్ల వలకు చిక్కడంతో రూ.99 వేలు250 నష్టపోయారు. తోటగూడెంలోని సీతారామస్వామి దేవాలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న అంగలూరి రమణాచారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ బిల్లులతో పాటుగా ఇతర బిల్లులకు సంబంధించి నగదు మీ ఖాతాకు జమ కావలసి ఉందని, అందుకు సంబంధించి మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబరును చెప్పని శుక్రవారం సాయంత్రం ఓ ఫోన్ వచ్చింది. అది నిజమని నమ్మిన రమణాచారి తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీలు చెప్పడంతో సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతా నుంచి నగదును మాయం చేశారు. దీంతో నగదు విత్‌డ్రా అయినట్టు ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో తిరిగి వారికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించి పెదపాడు పోలీసులను ఆశ్రయించాడు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగివైరు చోరీ

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రైతుల పొలాలకు నీరందించే ట్రాన్స్ ఫార్మర్లను దొంగలు నాశనం చేస్తున్నారు. ఏలూరు సమీపంలోని చొదిమెళ్ల శివారు పొలాల్లోని 16కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం అర్ధరాత్రి పగులగొట్టి అందులోని రాగి వైరును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న తంగెళ్ళమూడి ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస రావు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంతో విలువైన ట్రాన్స్‌ఫార్మర్లను నిర్వీర్యం చేయడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

నకిలీ ఏటీఎం కార్డుతో మోసం

▸ రూ.39,500 అపహరణ

ఆకివీడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నగదు డ్రా చేసి ఇస్తానంటూ ఓ అపరిచితుడు మాయమా టలు చెప్పి ఏటీఎం కార్డు తీసుకుని నకిలీకార్డు ఇచ్చిన ఘటన అయి-భీమవరం రోడ్డులో చోటు చేసుకుంది. ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు ఉపాధ్యాయురాలు ఎస్.సూర్యకుమారి, భర్త సత్యనారాయణమూర్తి శుక్రవారం వెళ్లారు. ఏటీఎంలో నగదు కోసం ప్రయత్నించగా నగదు రాలేదు. అక్కడే ఉన్న ఓ వ్యక్తి నేను ఇప్పుడే డబ్బు డ్రా చేశాను నేను ప్రయత్నం చేస్తానంటూ కార్డు తీసుకున్నాడు. ప్రయత్నం చేసిన అనంతరం నగదు రావడం లేదంటూ చెప్పి సూర్యకుమారికి వేరే నకిలీకార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. అనంతరం నాలుగు దఫాలుగా ఏటీఎం నుంచి రూ.39,500 డ్రా చేసినట్టు ఆమె ఫోన్‌కి మెసేజ్ రావడంతో కంగారుపడి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఆకివీడు ఎస్ఐ హనుమంతు నాగరాజు మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నామని, అపరిచితుల విషయంలో జాగ్ర త్తగా ఉండాలని సూచించారు.

చెరువులో పడి ఒకరి మృతి

పెదవేగి, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : చెరువులో దిగిన గేదెలను బయటకు రప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ వీరంపాలెంకు చెందిన పరసా సత్య నారాయణ, రాధిక భార్యభర్తలు, వ్యవసాయ పనులతో పాటు పశుపోషణతో జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామం సమీపంలోని ఎర్రచెరువులో దిగిన గేదెలను బయటకు రప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు ఆ నీటిలో సత్యనారాయణ (35) జారిపడి, ఊబిలో కూరుకుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

పశువుల అక్రమ రవాణా

▸ ఒకరి అరెస్ట్.. కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేసి అతడిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. భీమడోలు అంబర్‌పేటకు చెందిన షేక్ రహీమ్(26) బొలెరో వ్యానులో సీతంపేట నుంచి మినీవ్యానులో రెండు ఆవులను నాలుగు గిత్తలను తోటగూడెం ప్రాంతానికి తీసుకు వెళ్తున్నాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్‌కు అందడంతో సిబ్బందితో శుక్రవారం ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద అతడిని వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మినీ వ్యాన్ సీజ్ చేశారు. పశువులను ఏలూరు నగరంలోని గోశాల సమితికి తరలించారు.

రేపు ఉచిత మెడికల్ క్యాంప్

భీమవరం అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను వసుధ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ బలరాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి మెంటేవారి తోట సుందరయ్య భవనంలో చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ పీఎస్ వెంకట్రాజు పాల్గొంటారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రెగ్యులర్‌గా ఉచిత వైద్య సహాయ కేంద్రం, ఉచిత రక్తపరీక్షల ల్యాబ్ ప్రతిరోజు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రేలంగిలో రాయితీపై దాణా పంపిణీ

ఇరగవరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడిరైతులకు రాయితీపై అందిస్తున్న దాణాను సద్వినియోగం చేసుకోవాలని రేలంగి పశువైద్యాధికారి డాక్టర్ పీవీఎస్‌టీవీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రేలంగి పశువైద్యశాలలో 50శాతం రాయితీపై పశువుల దాణాను పాడిరైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న దానాలో అన్ని రకాల పోషక విలువలు ఉంటాయన్నారు. టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు, కూటమి నాయకులు కామన రాంబాబు, కె.రామకృష్ణ, ఎం.శ్రీనివాస్, వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

4 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం : బొలిశెట్టి


తాడేపల్లిగూడెం ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల మొక్కలను నాటడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పర్యావరణంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబునాయుడు సంకల్పించారన్నారు. గట్టిం మాణిక్యాలరావు, ఫుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, వర్తనపల్లి కాశి, అడబాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు శుద్ధమైన నీరు అందిస్తాం

»రాయలంలో క్లోరినేషన్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు


క్లోరినేషన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గం లోని ప్రతి గ్రామానికి, శివారు ప్రాంతాలకు శుద్ధమైన మంచినీటిని అందిస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. రాయలం గ్రామంలో నూతనంగా నిర్మించిన క్లోరినేషన్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీడబ్ల్యూఎస్ స్కీం-2 కింద సుమారు రూ. 6 లక్షల వ్యయంతో రాష్ట్రంలోనే మొదటి క్లోరినేషన్ ప్లాంట్‌ను గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. మోడ్రన్ నియోజకవర్గంగా భీమవరాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. గ్రామస్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన విప్ నాయకర్, తదితరులు

బస్టాండ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

నరసాపురం,జూన్ 6(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని విప్ నాయకర్ కోరారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆర్డీవో దాసిరాజుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్లబ్ సభ్యులు సత్యవతి, కోట్ల రామ్‌కుమార్, సూర్యకుమారి, మురళీధర్, శ్రీధర్, విజయ్, అందే కృష్ణ, పార్థసారథి పాల్గొన్నారు.

కూటమినేతలు సమన్వయంతో ముందుకు సాగాలి


పెదమల్లం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

ఆచంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) :కూటమి నేతలు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెదమల్లం, కోడేరు గ్రామాల్లో కూటమి నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకుల మధ్య చిన్నపాటి అభిప్రాయ బేధాలు ఉంటే మండల, నియోజకవర్గ సమన్వయ కమిటీలో చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, చిలుకూరి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 'పల్లె పల్లెకు మన పితాని' కార్యక్రమంలో భాగంగా పెదమల్లంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వశిష్ట గోదావరిపై కోడేరు నుంచి తూర్పుగోదావరి జిల్లా గన్నవరం గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, కోడేరు సర్పంచ్ పెచ్చెట్టి కనకదుర్గదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో 'ముదునూరి' మోసం


విలేకర్లతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

నరసాపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అభివృద్ధి పేరుతో ప్రజల్ని దోచుకున్నారని జనసేన నాయకులు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మత్స్యకార జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు మైలా వసంతరావు, డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు గుబ్బల మార్రాజు, జనసేనకులు కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని మాట్లాడారు. వైసీపీ వెన్నుపోటు దినంలో విప్ నాయకర్‌పై చేసిన వ్యాఖ్యల్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీలను తీసుకొస్తామని చెప్పి పక్క ప్రాంతానికి అప్పగించి తీరప్రాంత ప్రజల్ని వెన్నుపోటు పొడిచింది ముదునూరి కాదా అంటూ ప్రశ్నించారు. వాతాడి కనకరాజు, దిలీప్, గంటా కృష్ణ, జయరాజు, ఆకన చంద్రశేఖర్, రవీంద్ర, పోలిశెట్టి సాంబ పాల్గొన్నారు.

ఇస్కాన్ స్వామిజీలచే నగర సంకీర్తనలు

అత్తిలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అత్తిలి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయానికి ద్వారకా నుంచి రథయాత్రగా 20 మంది ఇస్కాన్ స్వామీజీలు శుక్రవారం వచ్చారు. వారితో హనుమాన్ శక్తి జాగరణ సమితి సభ్యులు, గ్రామస్థులు నగర సంకీర్తన చేస్తూ ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. కోలాట భజనలు, సంకీర్తనలు పాడుతూ ఊరేగారు.

ఎన్‌హెచ్ 165 భూములపై అభ్యంతరాల స్వీకరణ

కాళ్ళ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 165 జాతీయ రహదారి అభివృద్ధి పనుల కోసం సేకరించాల్సిన భూములపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ జి.సుందర్‌సింగ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కోలనపల్లి, సీసలి, జక్కరం, కోపల్లె, పెదఅమిరం, వేంపాడు గ్రామాల్లో సేకరించే భూముల వివరాలను ఆయా పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో పెట్టినట్లు ఆయన తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 14వ తేదీలోపు తహసీల్దార్ కార్యాలయంలో తెలపాలన్నారు.

నాలుగు ఎకరాల గడ్డి వాము, బైక్ దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలించిన సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ

పెంటపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : పెంటపాడులోని కొబ్బరితోట ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున కౌలు రైతు కొరెడ్డి లక్ష్మణరావుకు చెందిన నాలుగు ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. పక్కనే ఉన్న మోటార్‌సైకిల్ కూడా కాలి పోయింది. స్థానికులు తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సిబ్బంది, స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. వార్డు సభ్యుడు వెలగల శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, టీడీపీ నాయకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న బాధితులను పరామర్శించారు.

ఆప్కాబ్ చైర్మన్ 'గన్ని'కి అభినందనలు

గణపవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆప్కాబ్ చైర్మన్‌గా విజయవాడలో ప్రమాణస్వీకారం చేస్తున్న గన్ని వీరాంజనేయులును అభినందించేందుకు మండల గ్రామాల నుంచి పెద్దఎత్తున కూటమి నేతలు శుక్రవారం ర్యాలీగా తరలివెళ్లారు. కార్యకర్తల హర్షధ్వనుల మధ్య ఆయన పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయననను అభినందించిన వారిలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, ఉంగుటూరు తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు, గణపవరం మండల టీడీపీ అధికార ప్రతినిధి కూనసాని నాగేశ్వరరావు, గణపవరం టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, గణపవరం మండల తెలుగుయువత అధ్యక్షుడు కాపారం చిన్న, మొయ్యేరు టీడీపీ అధ్యక్షుడు కానుమిల్లి చంటి, జనసేన నాయకులు చింతలపాటి బాసిరాజు, జనసేన నాయకులు చింతలపాటి బాసిరాజు, నిమ్మల దొరబాబు, తోట శ్రీనివాసరావు, అలుమోలు అరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.


గన్నిని అభినందిస్తున్న గణపవరం కూటమి నాయకులు.. పుష్పగుచ్ఛం అందజేసిన వలవల బాబ్జి

'గన్ని'కి శుభాకాంక్షలు తెలిపిన బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్ : ఆప్కాబ్ చైర్మన్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన గన్ని వీరాంజనేయులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గన్నిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్ పాల్గొన్నారు.

'గన్ని, శేషారావు'కు అభినందనలు

భీమవరం అర్బన్ : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్/పాలకొల్లు అర్బన్, జూన్6(ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వం మెరిట్ విద్యార్థులకు అందించే జిల్లాస్థాయి ప్రతిభా అవార్డులకు తాడేపల్లిగూడెం జూనియర్ కళాశాల విద్యార్థులు హెచ్‌ఈసీ విద్యార్థి వడితే శ్రీలత, ఎంఎల్‌టీ విద్యార్థి షేక్ అఫ్రాతె హాసిని, చల్లా శిరీష ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ నాగవేణి తెలిపారు. ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు సాధించినట్టు వివరించారు. పాలకొల్లు పట్టణంలోని చాంబర్స్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచి వెయ్యి మార్కులకు 966 మార్కులు సాధించిన ఐ.లక్ష్మణ్ వర్షిత్, రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించడంతో అవార్డుకు ఎంపిక అయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ కేవీఆర్ నరసింహారావు తెలిపారు.

పాకా సత్యనారాయణకు సత్కారం

భీమవరంటౌన్,జూన్ 6(ఆంధ్రజ్యోతి): మేధావుల సభకు దశాబ్దాల అనుభవం కలిగిన వ్యక్తి పాకా సత్యనారాయణ వెళ్లడం మన జిల్లాకే గర్వకారణమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, కో-కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్వో భట్టిప్రోలు శ్రీనివాస రావు, కొత్త శ్రీనివాస్ అన్నారు. రాజ్యసభ సభ్యునిగా సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత భీమవరం వచ్చిన సందర్భంగా మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ, చవ్వ భామకృష్ణమూర్తి, కురిశెట్టి కాశి, బొడ్డు వాసు, కోట్ల నాని, ఫులవర్తి రామకృష్ణ, బంగారు రాము, కనగర్ల కిషోర్, తటవర్తి బదరి, సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్‌గా బాలమురళీకృష్ణ

గణపవరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గణపవరం పీహెచ్‌సీలో మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా ఎం.బాలమురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్‌టీఆర్ జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం విచ్చేసి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ప్రభుత్వ వైద్యాధికారులు కిరణ్మయి, ఓంకార్‌నాథ్, ఎంపీహెచ్‌వో విల్సన్‌బాబులు, సిబ్బంది అభినందించారు.

పని గంటలు పెంచడాన్ని ఉపసంహరించాలి

తణుకు, జూన్ 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో లేబర్ కోడ్‌లు అమలు నిలిపివేయాలని నినాదాలు చేశారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.


చండ్ర రాజేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులర్పించిన దృశ్యం

'రాజేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలి'

తణుకు/భీమవరం అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీకి సుదీర్ఘ సేవలందించిన చండ్ర రాజేశ్వరరావును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని దారిదీపం సంపాదకుడు డీవీఎస్ఎస్ వర్మ అన్నారు. శుక్రవారం రాజేశ్వరరావు జయంతి సందర్భంగా తణుకులోని వైఎస్ఆర్ పార్కు వద్ద వున్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శశి విద్యా సంస్థల ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్రప్రసాదు, కోట రామప్రసాదు, బి.బుచ్చిబాబు, పిట్టా శ్యామ్యూల్, కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. భీమవరం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆధ్వర్యంలో రాజేశ్వరరావు 112వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. తొలుత రాజేశ్వరరావు చిత్రపటానికి జిల్ల కార్యదర్శి కోనాల భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సీపీఐ నాయకులు నాగిడి శాంతమూర్తి, ప్రజానాట్య మండలి నాయకులు చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తంగా కూటమి ప్రభుత్వం

పోడూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో తట్ట మట్టికూడా తీయకుండా పంట కాలువలను వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని కూటమి ప్రభుత్వం రాగానే పంట కాలువల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి రైతు నేస్తంగా ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రరాజు రవి అన్నారు. పోడూరులో రూ.3.60లక్షలతో చేపట్టనున్న చించినాడ కాలువ తవ్వకం పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఉపసర్పంచ్ ఎస్.జయరామకృష్ణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రుద్రరాజు రమేష్‌బాబు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు కేతా వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నరసాపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని పశుసంవర్ధక వర్ధకశాఖ అధికారి డాక్టర్ సురేంద్ర అన్నారు. శుక్రవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో డాక్టర్ సురేంద్ర, నారా కృష్ణసాయి, చందుకుమార్, ఎం.గంగాధర్ సిబ్బంది కలిసి రెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం చేశారు. ఏడాదిలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణం నిలుపవచ్చన్నారు. ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలన్నారు. సిబ్బంది ఇచ్చిన రక్తాన్ని రెడ్ క్రాస్ సిబ్బంది సతీశ్ సేకరించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెంటపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి):పెంటపాడు శివారు పొలాల్లో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేశామని ఎస్ఐ స్వామి శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ 15,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.


ఆవుల కోసం ఏర్పాటు చేసిన గరుకు స్తంభాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రామానాయుడు

గోవులను వీధుల్లో వదలడం మానుకోవాలి : మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గోవులను వీధుల్లో వదిలి వేయడం యజమానులు మానుకోవాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు సూచించారు. యునైటెడ్ కాపు వనిత క్లబ్ పర్మినెంట్ ప్రాజెక్టులో భాగంగా పట్టణంలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గోవుల గరుకు స్తంభాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. తప్పనిసరిగా వదిలే వారు సైతం గోవులను తమ ఇళ్ల వద్దనే కట్టుకోవాలని సూచించారు. పట్టణంలో జక్కంపూడి మధన్, అల్లంవారి యడ్లబజారులోనూ, డాక్టర్ ముచ్చర్ల సంజయ్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, కటికి అర్చన పూలపల్లి టర్నింగ్ వద్ద, తమ్మిరెడ్డి త్రినాధేశ్వరి శ్రీనివాస డీలక్స్ ఎదురుగా, డాక్టర్ వావలి ఉమాదేవి విశ్వమానవ వేదిక వృద్ధాశ్రమం వద్ద ఆవుల గరుకు స్తంభాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామమోహన్, జక్కంపూడి మదన్, మద్దాల వాసు, పోకల రాము, జక్కంపూడి కుమార్, రావూరి అప్పారావు, కానూరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గోవులను సంరక్షించాలని ర్యాలీలు

భీమవరంటౌన్/పాలకొల్లు అర్బన్ : గోవధ మహాపాపమని, ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ కె.మురళీకృష్ణ, డాక్టర్ పి.పండరీబాబు, డాక్టర్ కె.హేమ, డాక్టర్ ఎ.సత్యనారాయణ, డాక్టర్ సుధీర్ బాబు అన్నారు. భీమవరం పట్టణంలోని నాచువారి సెంటర్‌లో పశు సంవర్ధక శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అక్రమంగా జంతు వధ చేసినా.. రవాణా చేసిన అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

● పాలకొల్లు పట్టణంలో గోవులను సంరక్షించుకోవాలని కోరుతూ వీహెచ్‌పీ, హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ నాయకురాలు టి.సునీత మాట్లాడుతూ పవిత్రమైన గోవులను ఇటీవల దుండగులు దొంగిలిస్తున్నారు. క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీ చేరుకుని తహసీల్దార్ దుర్గ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు రావూరి సుధ, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, గాదె వెంకన్న, మల్లికార్జునరెడ్డి, బి.సత్యజిత్‌కుమార్, సీహెచ్ శ్రీనివాస్, ఎన్.భాగ్యలక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

పాలకొల్లు అర్బన్/అత్తిలి/పాలకోడేరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే యోగా నేర్చుకోవడంతో మంచి ఆరోగ్యంతో పాటు, క్రమశిక్షణ అలవడుతుందని గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి అన్నారు. పాలకొల్లు శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు యోగా, చిత్రలేఖనం, క్విజ్, కథల పోటీలు, పఠనం, చదరంగం, క్యారమ్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. యోగా గురువు కేవీవీ సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. నీతి కథలను ఉపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్, వి.వెంకట్రావు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన గురువులను ఘనంగా సత్కరించారు. అత్తిలి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు ఆధ్వర్యంలో పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పాలకోడేరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి జి.బాలరాజు ఆధ్వర్యంలో ఎనిమిది రకాల ఇండోర్ గేమ్స్ నిర్వహించి విజేతలకు ఎంఈవో పి.వెంకట శివనాగరాజు చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం చేశారు.

దొడ్డనపూడిలో 'లో-వోల్టేజీ' సమస్య పరిష్కరించాలి

కాళ్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని దొడ్డనపూడి గ్రామస్థులు శుక్రవారం ఆందోళన చేశారు. పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ కులాలకు చెందిన సుమారు 300 గృహాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో తీవ్ర లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు గతంలో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయానికి ఆ ప్రాంతంలో ఉన్న వైసీపీకి చెందిన బడా రైతు అది ప్రభుత్వ భూమిలో ఉందంటూ ఫిర్యాదు చేయడంతో సరఫరా ఇవ్వకుండా విద్యుత్ శాఖ అధికారులు నిలిపివేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గడిచిన ఏడాది నుంచి లోవోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుత వేసవిలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకువెళ్లేందుకు అందరూ సిద్ధపడుతున్నామన్నారు. కొల్లి వెంకట రామారావు, యిర్రింకి వెంకటేశ్వరరావు, కొల్లి వీరపండు, వెంకటేశ్వరరావు, పేరయ్య, నానాజీ, తదితరులు ఉన్నారు.

ప్రజలకు స్వచ్ఛ జలం

(5వ పేజీ తరువాయి)

సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేశారు. ప్రభుత్వం ఆమోదించడంతో త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి. ఒక దశలో పల్లెలకు వాటర్‌గ్రిడ్, పట్టణాలకు మరో పైప్‌లైన్ వేస్తే అత్యధిక వ్యయం అవుతుందన్న విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజారోగ్య శాఖ అధికారులు వద్ద ప్రస్తావించారు. వ్యయం తక్కువతో పశ్చిమ ప్రజలకు రక్షిత మంచినీరు అందించేందుకు నివేదిక తయారు చేయాలని దిశానిర్దేశం చేశారు. వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ సామర్థ్యం పట్టణాలకు సరిపోదన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నారు. పట్టణాల్లోని పంపుల చెరువులకు నీటిని మళ్లించి శుద్ధి చేస్తారు. పట్టణాల్లో అంతర్గత పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయనున్నారు.

వేసవిలో అనుకూలం

పట్టణ ప్రజలకు వేసవిలో మంచినీరు సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారు. వేసవిలో సమృద్ధిగా నీరందించడానికి పట్టణాల పైప్‌లైన్ ప్రాజెక్ట్ ఉపయోగపడనుంది. నేరుగా విజ్జేశ్వరం నుంచి పంపుల చెరువులకు నీటిని మళ్లించడం ద్వారా కాలువల కాలుష్య ప్రభావం తగ్గుతుంది. అందుకోసం ప్రత్యేకంగా పైప్‌లైన్ ప్రాజెక్టుకు నివేదిక సిద్ధం చేశారు. ఇటీవల ప్రభుత్వ స్థాయిలో దీనిపై చర్చసాగింది. నివేదికపై సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే టెండర్ ప్రక్రియను చేపట్టనున్నారు.

ఆధ్యాత్మికం | వైభవంగా రామాలయ పునఃప్రతిష్ఠ

పాలకోడేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పెన్నాడ కునుకు వారి వీధిలో అతిపురాతనమైన శిథిలమైన రామాలయానికి శుక్రవారం దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ కమిటీతోపాటు పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు. హరికృష్ణ, రేఖా సుప్రియ దంపతులతో ప్రతిష్ఠ పూజలు అర్చకులు చేయించారు. రైస్ మిల్లర్ నేరెళ్ల పెదబాబు తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న విగ్రహ ప్రతిష్ఠ

ఆకివీడు : ఆకివీడు సమతానగర్ రోడ్‌లో నూతనంగా పునఃనిర్మించిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగాయి. బొల్లా

అమ్మవారి పీఠానికి వెండి బహూకరణ

భీమవరంటౌన్ : మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి దాతలు 100 గ్రాముల వెండిని విరాళంగా అందించారు. భీమవరంకు చెందిన పొత్తూరి వెంకటేశ్వరరావు లక్ష్మి శివరంజని దంపతులు 100 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు.


ఆందోళన చేస్తున్న వార్డు సభ్యులు

కుళాయిల్లో మంచినీరివ్వండి

నరసాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మంచినీటి కుళాయిల్లో మూడు రోజులుగా మురుగునీరు సరఫరా అవుతున్నాయని పట్టణంలోని చలవపేట, పొన్నపల్లి ప్రాంత ప్రజలు శుక్రవారం మునిసిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. పైప్ లైన్ పగిలి మురుగునీరు సరఫరా అవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రోజుకు ఒక ట్యాంకర్ పంపితే ఎంత మందికి నీరందుతుందని ప్రశ్నించారు. కమిషనర్ అంజయ్య తక్షణం మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చారు. డి.రామకృష్ణ, ఎన్.తులసి, ధర్మారావు, బి.శ్రీను పాల్గొన్నారు.

ఉన్నతంగా చదువుకోవాలి

తణుకు,జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఆర్థికంగా ఆదుకోవడానికి దాతల సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో డిగ్రీ చదువుతున్న పి.సువర్ణకు కళాశాల ఫీజు నిమిత్తం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ నాయకుడు కంటిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దు : ఐద్వా

ఆకివీడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలతో నగర పంచాయతీ అధికారులు చెలగాటమాడుతున్నారని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు డోకల లక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక దొరగారి చెరువు వాటర్ ట్యాంకు వద్ద ధర్నా చేసి మాట్లాడారు. పదిహేను రోజుల నుంచి పట్టణ పరిధిలో కుళాయిల ద్వారా పసరుతో కూడిన నీటిని సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బి.కళ్యాణి, బి.పార్వతి, జీవీ లావణ్య, అచ్చాయమ్మ, రాణి, కుమారి, వరాలమ్మ తదితరులు ఉన్నారు.

పుస్తకాల అమ్మకాలను అడ్డుకోవాలి

» ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

ఆకివీడురూరల్ జూన్6(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ విద్యాసంస్థలలో పుస్తకాల అమ్మకాలను అడ్డుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యాశాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. దుంపగడపలోని చైతన్య విద్యాసంస్థలలో పుస్తకాలు నేరుగా అమ్ముతుండడంతో తాము పట్టుకుని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చామని, స్థానిక సీఆర్‌పీ పరమేశ్వరి ఆ గదికి తాళంవేసి తీసుకెళ్లారని తెలిపారు. ఫీజుల పేరుతో వేలాది రూపాయలు దోచుకోవడమే కాకుండా పుస్తకాలు అమ్మకాల ద్వారా లక్షల రూపాయలు ఆర్జించాలని ఆశపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టిప్రసాద్, పి.నాగేంద్ర, గోవింద్, కె.రోహిత్, సాయి, వంశీ, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ రోడ్లకు ప్రభుత్వం కృషి

పాలకొల్లు రూరల్, జూన్6(ఆంధ్రజ్యోతి): రైతాంగ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ అన్నారు. గోరింటాడ చానల్‌పై రూ.35 లక్షలతో జరుగుతున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను కూటమి నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల చొరవతో రైతాంగానికి సంబంధించిన అభివృద్ధిపనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పెన్మత్స రామభద్రరాజు, నాయకులు కె.రజనికుమార్, మండేల త్రిమూర్తులు, శీలం సత్యనారాయణ, పంపన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.